నాకెందుకో చిన్నప్పటి నుంచీ 'సౌందర్యం' అంటే మనస్సు. ఈ సౌందర్యారాధన మనస్సు నాకు పుట్టుకతో వచ్చిందే కనక పుడకలతో కానీ పోదని అనుకుంటూ ఉంటాను.

మనిషిలోనో, మనస్సులోనో, వేప పూతలోనో, వెన్నెల పూతలోనో తొంగి చూచే రవ్వంత సౌందర్యమైనా చాలు నా ప్రాణానికి. ఆ కాస్త పరిమళంతో ప్రొద్దూకులూ పరవశించిపోగలను.

కాకులు దూరని కారడివిలోకూడా కాస్త సుందరతను దర్శించుకోవచ్చునని నా మతం. సత్యం, శివం, సుందరం అయిన ఈ సృష్టి యావత్తూ సౌందర్య విరాజితమే!

మనుషులైనా అంతే. ఎంత వికారంగా ఉన్న మనిషిలో నయినా సరే, ఏదో ఒక మూల. ఏదో ఒక రూపంలో, నలకంత అందం గోచరించకుండా ఉండదు. మాటలోనో, మూతివిరుపులోనో, నవ్వులోనో, పలువరుస తీరులోనో, ప్రచ్ఛన్నంగా దాక్కుని ఉంటుంది ఆవగింజంత అందం!

'అశాశ్వతమైంది భౌతిక సౌందర్యం. అది ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే! మనిషికి ముఖ్యమైంది మానసిక సౌందర్యం' అంటారు కొంతమంది.

ఆ మాట కాదనను. కాని, మానసిక సౌందర్యంతోపాటు రవ్వంత రంజింపచేసే రామణీయకతకూడా మనిషికి ఉండాలి. అది లేకపోతే ఆ కాస్త ఊహ మాత్రంగా నయినా నేను దర్శించుకో లేకపోతే ఏదో బాధ వచ్చి విలవిలలాడి పోతాను.

మా పదిహేనేళ్ళ కాపురంలోనూ నేను చేస్తూ వచ్చిన పని అదే. వంటింట్లో వంటకాల్లోనూ, ముంగిట్లో ముగ్గుల్లోనూకూడా నా సౌందర్య ప్రియత్వాన్ని ఏదో విధంగా ప్రదర్శించుకుంటూనే ఉంటాను. గృహిణినయినా, తల్లినయినా అడుగడుగునా రసోత్కంఠంతో స్పందించి పోయే గుండెని మాత్రం అదుపులో పెట్టుకోలేకపోయినాను.

ఆయనగారికి మాత్రం ఆ అందమూ, ఆనందమూ అంతా అక్కౌంట్స్‌లోనే అందుబాటు అవుతూ ఉంటాయని అనిపిస్తుంది. లెఖ్ఖలూ, అకౌంట్సూ అంటే ఆయనకు ఎక్కడలేని ఉత్సాహం. హెచ్చవేతలు, తీసివేతలు, కూడికల్లోనే సౌందర్యభావనా, రసస్పందనా ఏ మూల దాక్కుని ఉంటాయో నాకు మాత్రం తెలియదు!

అందుకే ఆయనగారి అకౌంట్స్‌లో అందాలు వెదకడం నేను మానుకున్నాను. నా హృదయగతమైన భావుకతా, సౌందర్యాన్ని వెతికి పట్టుకునే నేర్పూ ఆయనకు లేకుండా పోయాయి.

ఈ విషయంలో తప్పితే, మా సంసారం సామరస్యంగా సాగిపోతూందనే చెప్పవచ్చు. తొమ్మిదేళ్ల మహేష్, ఏడేళ్ల మంజుల అందుకు సాక్ష్యులు.

అకౌంట్స్‌లోనూ, అర్జన లోనూ కూడా ఆయనగారు కొంత పై అంకె అందుకున్నారు. కొంత స్థాయీ, స్టేటస్ కూడా పెరిగాయి.

అద్దె కొంపలతో అప్పటికే విసుగు వచ్చేసింది మాకు. కొంత కూడబెట్టుకున్న సొమ్ముంది. కొంతఅక్కౌంటెంట్ జనరల్ వారి అకౌంట్స్‌లో నుంచి అప్పు సంపాదించారు. స్థలం కొని ఇల్లు కట్టడం ప్రారంభించారు. అకౌంట్స్ సెక్షనంతా ఆయన గారిది. అలంకరణల డిపార్టుమెంటు నాది.

నా అభిరుచికి తగినట్లుగా ఇంటిని రూపు దిద్దుకోవాలని నా ఆరాటం. ఆ ఆవేశంతో నేను ఏవో ఊహలు అల్లుతుండేసరికల్లా, ఆయనగారు అకౌంట్స్ పుస్తకం నా ముందు పెట్టి, ఈ లోకంలోకి ఈడ్చుకు వస్తూండేవారు.

మేము స్థలం కొని ఇల్లు కడుతూ ఉండిన ప్రాంతంలో చుట్టుపక్కల పెద్ద బిల్డింగులు ఏమీ లేవు. సామాన్యపు పెంకుటిళ్లూ, పూరిళ్లూ మాత్రం ఉన్నాయి. తయారయితే, మేము కడుతూ ఉండిన ఇల్లు ఒక్కటే ఆ ప్రదేశానికంతా అందమైన భవంతి అవుతుంది.

డ్రాయింగ్‌రూమ్‌లో షో కేస్‌లా ఈ గోడంతా అలమర అమరాలి. కిచెన్ షెల్ఫ్‌కు డెకొలమ్‌ట్‌తో తలుపులు పెడితే చూడటానికి నీట్‌గా ఉంటుంది. వరండా పక్కగా పూలమొక్కలు పెట్టుకోవటానికి అనువుగా సిమెంట్ తొట్లు కట్టాలి. దక్షిణం వైపున ఒక చిన్న సిట్ ఔట్‌గా పెంచితే బాగుంటుంది.

ఇట్లా కట్టే కట్టే ఇంట్లోకీ, బయటికీ పది మాట్లు తిరుగుతూ పది రకాలుగా ప్లాన్లు వేస్తూ ఉండేదానిని. అయితే, ఆయనగారి అకౌంట్స్ మాత్రం మధ్యేమార్గంలో సుదర్శన చక్రంలా అడ్డుకుని నన్నూ, నా ప్లాన్లనీ అదుపులో పెడుతూ ఉండేవి.

కొత్త ఇంటికి మెరుగులు దిద్దుకునే తొందరలో, హడావిళ్లలో అదాటుగా ఎప్పుడో చూచాను మా పక్క ఇంటి పెంకుటింట్లో ఇల్లాలిని.

పేరుకు అది పెంకుటిల్లే కాని, దానికన్నా బాగా కప్పిన పూరిల్లే నయమేమో అనిపించేట్లుగా ఉంది. పెంకులన్నీ అస్తవ్యస్తంగా ఉండి, సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ, వానదేవుణ్ణీకూడా లోపలకు ఆహ్వానించేట్లుగా సందులు కనిపిస్తున్నాయి.

పిల్లలయితే నలుగురో, ఇంకా ఎక్కువ మందో కనిపిస్తూ ఉండేవారు. ఆ ఇంటాయన మాత్రం ఇంతవరకూ నాకు కనిపించలేదు.

నేను పడమటి వైపు నుంచి ఇంటి ఎలివేషన్ ఎలా వచ్చిందా అని కాస్త ఎడంగా నించుని పరీక్షిస్తున్నాను. ఆవిడ గంజినీళ్లో ఏమిటో గిన్నెతో పట్టుకు వచ్చి బయట ఒలకపోసి వెనక్కు తిరిగింది.

అప్పుడు చూచాను ఆవిణ్ణి. ఆవిణ్ణి అనేకంటే నేను ముడివేసి విడిచిన ఆవిడ కబరీభారాన్ని చూచి కదిలి పోయాను, ఏదో కడుపు నిండిన అనుభూతితో.

ఆవిడ రూపం అతిలోకం ఏమీ కాదు. సామాన్యమైనదే. ఒంటిమీద చీర మామూలు నేతచీర. వెలిసిపోయిన చీర. చీర కట్టుకోవటంలోనూ ప్రత్యేకత ఏమీ లేదు.

కాని, ఆ శిరోజాలు, ఆ తలకట్టు, కాస్త నొక్కులతో, కారుమేఘంలా, కారు చీకట్లా చుట్టుకుపోయిన ఆ కబరీ భారం చూచేప్పటికి నా సౌందర్యప్రియత్వం పురివిప్పిన నెమలిలా నాట్యం చేసింది.

అవన్నీ ఆవిడ వెంట్రుకలేనా? ఏ సవరమన్నా దోపి ఉండదు కద! అంత నిరాడంబరంగా ఉన్న మనిషి సవరం పెట్టి అంత సిగసంతరించుకుని ఉండదు. ఊహూ. . . అదంతా ఆవిడ కేశసంపదే అయి ఉంటుంది.

సౌందర్యం ఏపాటిదయినా, ఏ కోణంలో ఇరుక్కుని ఉన్నా, చూచి ఆనందించ గలది నా మనస్సు— అని మొదట్లోనే చెప్పుకున్నాను. కాని, ఇప్పు డది కించిదసూయకూడా కలగజేసిందని ఒప్పుకోక తప్పదు.

'కాకిపిల్ల కాకికి ముద్దు' అన్నట్లుగా అద్దంలో చూచుకుంటే ఎవరి ముఖం వారికి అందంగానే కనిపిస్తుంది. అలాగే నాముఖమూ నాకు బాగానే ఉన్నట్లు అనిపిస్తుంది. వేషంలోకూడా చాలా మట్టుకు శ్రద్ధ తీసుకుంటూనే ఉంటాను.

కానీ, నాకు బొత్తిగా నచ్చనిది నా తలకట్టు. చిన్నప్పటినుంచీ నాకు బారెడు జడ ఉండాలని కోరికగా ఉంటే, అది బెత్తెడు దాటి పెరగనని మొరాయించేసింది.

పెళ్లిచూపులప్పుడూ, పెళ్లిలో మా వాళ్లు సవరం పెట్టి జడ వేశారు. అది చూచి నిజమే అనుకుని, నా జడ కొలత సుమారు ఇన్ని అడుగుల ఇన్ని అంగుళాలు ఉంటుందని కౌంట్ చేసి అకౌంట్‌లో వేసుకున్నారట ఆయనగారు.

పెళ్లయిన కొత్తల్లో తలకు భారంగానూ, అడ్డంగానూ ఉంటే సవరం తీసి మూలకు పెట్టేశాను. నా జడ నిజ స్వరూపాన్ని చూచి ఆయన గారు కాస్త బాధపడ్డ మాట నిజం. ఆయన అకౌంట్‌లో మళ్లీ సబ్‌ట్రాక్షన్ చేయవలసివచ్చిందే అని విసుక్కుని ఉంటారు!

కాస్త వయస్సు ముదిరీ, పిల్లలు పుట్టీ, ఇప్పుడు మరీ నల్లపూసయింది నా జడ. పొడుగు లేకపోవటానికి తోడు ఒత్తుకూడా తగ్గిపోయి పలచబడి పోయింది.

సవరం పెట్టి జడ వేయాలన్నా కుదరక, బన్ పెట్టి ముడి వేయాలన్నా ముడి పడక మహా వేధిస్తూ ఉంది నన్ను. అందుకే ప్రాణం విసిగి, ఆ ఉన్న నాలుగు వెంట్రుకలూ రిబ్బన్‌తో బంధించి అలా గాలికి వదిలివేశా నిప్పుడు.

“పెళ్లిచూపులప్పుడు చాంతాడంత జడ చూపించి మోసం చేశారు నన్ను. సవరం సంగతి తెలిస్తే, లక్ష రూపాయలు కట్నం ఇచ్చినా చేసుకునే వాణ్ణి కాదు” అంటూ సరసం ఆడుతూంటా రాయన.

ఆ అందమైన కబరీభారం చూచిన సౌందర్యభావనతో నా మనస్సంతా నిండి పోయింది. చక్కగా సంస్కారం చేసి దువ్వి నాలుజడ వేస్తే? కొత్త నమూనాలో ఆ జుత్తంతా పైకి తీసి సిగ చుడితే?

తిరిగి చూచేలోపలే ఆవిడ ఇంట్లోకి వెళ్లిపోయింది. ఊహల మాలికలతో జడలు అల్లుకుంటూ నేనూ లోపలకు నడిచాను.

లోటు బడ్జెట్ వల్ల నాకు కావలసిన హంగులన్నీ జతకూర్చుకో లేకపోయినా, మా ఇల్లు చాలా వరకు సంతృప్తికరంగానే తయారయిపోయింది.

బంధువర్గం, మిత్రబృందంతోపాటు కొత్త ఇంటి ఇరుగు పొరుగు వారినికూడా గృహప్రవేశం నాడు భోజనానికి పిలిచాము. పెద్ద వేణీ బంధంతో నలుగురు పిల్లల్నీ తీసుకుని ఆవిడకూడా వచ్చింది.

మాటల సందర్భంలో ఆమె పేరు కృష్ణవేణి అని తెలుసుకుని నవ్వి అన్నాను:

“పుట్టినప్పుడే మీ కింత 'కృష్ణవేణి' ఉందా ఏమిటి? లేకపోతే మీ వాళ్లకెలా తెలిసిందీ ఆ పేరు పెట్టాలనీ!”

మొదట్లో ఆవిడ అర్థంకాక నా వంక తెల్లబోయి చూచింది. అంతలోనే మళ్లీ అర్థం చేసుకుని నవ్వి, “ఆఁ . . . అదొక్కటేనండీ నన్ను విడిచి పెట్టకుండా ఉన్న సంపద!” అన్నది.

ఇంట్లోకి తెచ్చి నన్ను వదేసినాక, ఆయనగారు ఇక తన పని ఏమీ లేదన్నట్లుగా గృహనిర్మాణపు అకౌంట్స్

క్లోజ్ చేసి ఆఫీసు అకౌంట్స్‌లో మునిగి పోయినారు.

నిలువుటద్దం మీద వలకంత మాసిక కనిపించినా, ఒళ్లు తుడుచుకున్న తడి టవల్ ఏ కుర్చీమీదో కనిపించినా, నాకు ప్రాణం విలవిలలాడిపోతుంది. ప్రతి వస్తువూ నిర్ణీత స్థలంలోనే ఉండాలి. పిల్లల పుస్తకాలయినా ఎగాదిగా పడిఉండ కూడదు. చేసిన ప్రతి పనీ పెర్‌ఫెక్టుగా ఉండాలి. ఇటువంటి మనస్సు పెట్టు కుని ఆ ఇంటిని పెర్‌ఫెక్టుగా ఉంచటానికి నే నెంత తంటాలు పడే దాన్నో చెప్పలేను.

ఇంటి బయటకూడా ఆవరణంతా శుభ్రం చేయించి, రకరకాల పూల మొక్కలు తెప్పించి పెట్టాము. సగం పరిశ్రమ ఇంట్లోనూ, మిగతా సగం ఇంటి బయటా చేస్తూ ఉండేదానిని. ఈ రంధిలో పడిపోయి నా ఆరోగ్యం విషయం బొత్తిగా నిర్లక్ష్యం చేసిన మాట నిజం.

కృష్ణవేణి ఎప్పుడైనా మా ఇంటికి వచ్చి పోతూ ఉండేది. మనిషి ఏదో దిగులుతో కృశించి పోతున్నట్లు కనిపించేది. కాని నా దగ్గరకు వచ్చినప్పుడు మాత్రం తెచ్చి పెట్టుకున్న ఉత్సాహంతో ఏదో పిచ్చా పాటి మాట్లాడుతూనే ఉండేది. ఆవిణ్ణి చూచినా, పిల్లల వాలకం చూచినా ఎంతో లేమిలో బాధపడుతున్నట్లు తెలు స్తూనే ఉంది. కాని, ఒక్కనాడయినా ఆమె తన సంసారపు స్థితిగతుల్ని గురించి కానీ, ఇబ్బందుల్ని గురించి కానీ నా దగ్గర ప్రస్తావన తెచ్చేది కాదు. అందుకే ఆవిడమీద నాకు ఒక విధమైన సద్భావం కలిగింది.

కృష్ణవేణి భర్త ఏదో కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడట. కాని, అతడు ఉదయంపూట కానీ, సాయంత్రంవేళ కానీ ఇంట్లో ఉండి పెళ్లాం బిడ్డలతో కాలం గడపటం నే నింతవరకూ చూడ లేదు. ఎక్కడకు వెళుతుంటాడో, ఏం రాచకార్యాలు చేస్తుంటాడో అని నాలో నేను అనుకుంటూ ఉండేదానిని.

ఆ వేళ నేను కర్టెన్‌క్లాత్ కుడుతూ కూర్చున్నాను. కృష్ణవేణి పెద్దకొడుకు పదేళ్ల వాడు వచ్చి వాకిట్లో నించున్నాడు.

"ఏమిటి, రామూ, ఏం ఇలావచ్చావు?" అని అడిగాను.

వాడు ఏమీ జవాబు చెప్పకుండా నించున్నాడు.

"అమ్మేం చేస్తోంది? భోజనా లయ్యాయా?" అన్నాను మళ్లీ.

"అమ్మ పొద్దుటినుంచీ పడుకునే ఉంది. ఈ వేళ అన్నం వండలేదు" అన్నాడు వాడు.

"అదేం? !" అన్నాను ఆశ్చర్యంగా. అప్పటికే ఒంటి గంట కావస్తోంది. కృష్ణవేణి ఈ వేళ జ్వరం వచ్చి పడుకుందో ఏమిటో?



# కృష్ణవేణి

**- వేదవతీదేవి**

నా కిక కుట్టుపని చేయ బుద్ధి కాలేదు. కట్టిపెట్టి కృష్ణవేణి ఇంటికి వెళ్లాను.

ముసుగు పెట్టుకుని పడుకుని ఉంది కృష్ణవేణి.

"జ్వరమా ఏమిటమ్మా?" అన్నాను ముసుగు తొలగిస్తూ.

కన్నీళ్ల చారికలు కట్టిన ముఖంతో, ఎర్రబడి ఉబ్బిపోయిన కళ్లతో లేచి కూర్చుంది కృష్ణవేణి. జుట్టు మొడి పిడి అంత రేగిపోయి చెదరిపోతూ ఉంది.

నన్ను చూచి మోకాళ్ల మీద తల పెట్టుకుని కూర్చుంది. భుజాలు కుదుపు చూస్తుంటే వెక్కి వెక్కి ఏడుస్తోందని తెలిసిపోయింది.

ఆవిడకు ఏం కష్టం వచ్చిందో నాకు తెలియలేదు. నిరుపేదగా కనిపించినా, కృష్ణవేణి చాలా అభిమానవంతురాలే. ఆవిడ మంచి కుటుంబంలో పుట్టి ఇప్పుడు ఈ బీదరికపు స్థితిలోకి వచ్చినట్లు నాకు అనుమానంగా ఉండేది.

"ఏమిటి ఏ బాధ, కృష్ణవేణీ? ఎందు కలా దుఃఖపడుతున్నావు? ఈ వేళ వంటకూడా చేయలేదట కదా?" అన్నాను మంచం మీద కూర్చుంటూ.

"అంతా నా దురదృష్టం. ఏం చెప్పనండీ?" అన్నది కృష్ణవేణి కొంచెం తల ఎత్తి.

"చూడూ, నీకు చెప్పాలని ఉంటే చెప్పు. లేకపోతే లేదు. కాని, మనసులో దుఃఖం మరొకరితో చెప్పుకుంటే కొంత

భారం తీరుతుంది'' అన్నాను అనునయంగా ఆమె భుజం మీద చేయి వేసి.

కృష్ణవేణి కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ చెప్పిన కథనం ఇది. పరువు గల మధ్య తరగతి కుటుంబంలో పుట్టిం దామె. ముగ్గురు ఆడపిల్లల తరవాత చాలా ఎడంగా, తండ్రి ఇంచుమించు సర్వీసునించి రిటైరయ్యే రోజుల్లో పుట్టింది. పెద్ద పిల్లలు ముగ్గురికీ కాస్త అంతస్తుకు మించిన సంబంధాలే తెచ్చి పెళ్ళిళ్ళు చేశాడు తండ్రి. కృష్ణవేణి దగ్గరకు వచ్చేటప్పటికి ఒంట్లోనూ, ఇంట్లోనూకూడా స్థితి తప్పిపోయింది.

థర్డ్ ఫారమ్ చదువుకునే పిల్లకు ఏదో సంబంధం కట్నం లేకుండా చేసుకునే వాళ్ళు వచ్చారని అర్థాంతరంగా చదువు మానిపించి పెళ్ళి చేశాడు. అంతటితో కన్నందుకు తన బాధ్యత వదిలిందని తృప్తికూడా పడి ఉంటాడు ఆ కన్న తండ్రి.

కృష్ణవేణి భర్త వయసు వచ్చిన దగ్గరినుంచీ వ్యసనాలకు అలవాటు పడి పోయినాడు. పెళ్ళాం వస్తే బాగుపడతాడని తల్లీ, తండ్రీ పెళ్ళికూతుళ్ళను వెతకటం మొదలు పెట్టారు. పెళ్ళి కూతుళ్ళు దొరక్కపోతే కట్నం లేకుండా చేసుకుంటామని ఎర పెట్టారు. ఆ ఎరకు తగులుకుపోయిన చేపపిల్ల కృష్ణవేణి.

తాళి కట్టించుకున్న భార్య కనక కాపురానికి వచ్చింది. సంసారం చేసింది. బిడ్డల్ని కన్నది. మొగుడికి వండి పెడుతున్నది. బిడ్డల్ని పెంచుకు వస్తున్నది.

ఆ మొగుడికి ఇన్నేళ్ళు గడిచేసరికి స్త్రీసంబంధమైన వ్యసనం కాస్త వెనక పట్టింది కాని, అంతకు అంత పేకాట పిచ్చి పట్టుకున్నది.

కంపెనీకి వెళ్ళి ఉద్యోగం వెలగపెట్టి నాలుగు రాళ్ళు తెస్తాడు. వచ్చిన జీతంలో సగమో ముప్పాతికో పేకాటలో అర్పణ చేసి చేతు లూగించుకుంటూ ఇంటికి వస్తాడు.

పేకాటలో కూర్చుంటే అతడికి ఒళ్ళు తెలియదు. రాత్రీ పగలూ తేడా తెలియదు. అదొక మత్తు. అదొక లోకం!

నిజానికి అతడికి వచ్చే జీతం పొదుపుగా వాడుకుంటే సంసారం సాఫీగానే సాగిపోతుంది. కృష్ణవేణి ఎంతో చెప్పి చూచింది. బ్రతిమలాడుకుంది. కాళ్ళావేళ్ళా పడ్డది. కళ్ళనీళ్ళు పెట్టుకున్నది.

ఊహుఁ అతడు ఇదేమీ వినిపించుకునే స్థితిలో లేడు. ఆ స్టేజీ దాటి పోయినాడు. చేతిలో డబ్బు లేకపోతే అప్పుచేసికూడా ఆడటం మొదలు పెట్టాడు.

నిన్న ఒకటో తారీఖు. ఇంట్లో బియ్యం గింజలు లేవు. జీతం రాళ్ళలో కొద్దిగా నయినా తెస్తాడనీ, బియ్యం తేవచ్చుననీ కూర్చుంది కృష్ణవేణి. ఈ వేళ తెల్లవారు జామున చేతులూగించుకుంటూ ఇంటికి వచ్చాడు. ఆ నాలుగు రాళ్ళూ పేకాటలో సమర్పించుకుని వచ్చాడు.

తెల్లవార్లూ కంట్లో వత్తులు వేసుకుని కూర్చున్న కృష్ణవేణికి ఏం మాట్లాడాలో తెలియలేదు. తా నేమన్నా అన్నా, ఎదురు తిరిగి పోట్లాడతాడు తప్ప ప్రయోజనం ఉండదు.

''ఇంట్లో ఈ పూటకి బియ్యం గింజలు లేవు. తెచ్చి పడేస్తే ఉడకేస్తాను'' అన్నది కృష్ణవేణి.


''తెచ్చి పడేస్తే ఉడకేస్తావు! మహా ఘనకార్యం చేస్తావు! ఈ పూటకి ఎక్కడన్నా అప్పు తీసుకురా!'' అన్నా డతడు విసురుకుంటూ.

''ఊహుఁ నా వల్ల కాదు. ఇళ్ళ వెంట అప్పులకు మాత్రం నన్ను పంపవద్దు!'' అన్నది అభిమానవంతురాలు కృష్ణవేణి.

''ఏం? ఇంతలోనే ఏమయింది! మహా గొప్ప ఘరానా కుటుంబంలోంచి పుట్టుకు వచ్చావా ఏమిటి! పక్కింటి మేడలోకి వెళ్ళి వస్తుంటావుగా? ఆవిణ్ణి అడిగి తీసుకురా ఈ పూటకి!'' అన్నా డతడు గొంతు పెంచి.

''నా వల్ల కాదంటే వినరేం? నెల జీతం పేకాట్లో ఎందుకు నాశనం చేసి వచ్చారు? పిల్లలూ, నేనూ ఏమయిపోతా మనుకున్నారు? చావనన్నా చస్తాను కాని, అడుక్కు తినటానికి బయలుదేరలేను'' అన్నది దుఃఖంతో, రోషంతో కృష్ణవేణి.

''అయితే, నట్టేట్లో పడి చావండి! పీడా విరగడై పోతారు!'' అనుకుంటూ విసురుకుంటూ వెళ్ళి పోయాడు, భార్యనూ, కుటుంబాన్నీ భరించవలసిన 'భర్త'!



''చదువన్నా చెప్పించాడు కదా మా నాన్న. ఏ చిన్న ఉద్యోగమో చేసుకుని పిల్లల కింత తిండి పెట్టుకునే ఆశా లేదు. బయటకు వెళ్ళి కూలో నాలో చేసి కూలిడబ్బులు సంపాదించుకుని పొట్ట పోసుకునే తెగకు చెందిన దాన్నీ కావటంవల్ల అప్పులకూబయలుదేరలేను. అడుక్కోనూ లేను. అభిమానం పాతిపెట్టనూ లేను. ఎందుకూ పనికిరాని వ్యర్థురాల్ని. ఏడవటం తప్ప ఏమీ చేతకానిదాన్ని. ఏం చేయను, చెప్పండి?'' అంటూ బావురు మన్నది కృష్ణవేణి.

నాకు ఏమని సముదాయించాలో తోచ లేదు. ఆమె భుజం తట్టి ఇంటికి వచ్చేశాను. కుక్కర్‌లో ఒక శేరు బియ్యం పడేసి వండి, అన్నమూ, పచ్చడీ, చారూ అర గంటలో ఆమె ఇంటికి పంపించాను.

మర్నాడు కృష్ణవేణి మా ఇంటికి వచ్చింది. ఏదో చెప్పాలని ఉన్నట్టూ, చెప్పలేకపోతున్నట్టూ కనిపించింది.

''ఏమిటి, కృష్ణవేణీ? బియ్యం ఏమన్నా కావాలా? ఇంటికి వచ్చాడా మీ ఆయన?'' అన్నాను ఆదరంగా.

''చూడండీ! ఇట్లా సాయం మీరు ఎన్నాళ్ళని చేస్తారు? ఈ దౌర్భాగ్యురాలికి దినం గడవటం కాదు; తనువు గడవాలి. మీ ఋణం ఈ జన్మలో తీర్చగలుగుతానా? మీది ఎంతో మంచి మనస్సు. గొప్పవారందరికీ ఇంత గొప్ప బుద్ధి ఉండదు. నాకు ఏ పనీ చేత కాదు ఇంటిపని తప్ప. ఒట్టి పనికిమాలినదాన్ని. మీ కేమయినా ఇంటిపనుల్లో సాయం కావలిసి వస్తే నన్ను పిలవండి. ఏదో ఒక పని చేసి పెట్టి, మీరు తృణమో పణమో ఇస్తే పిల్లల్ని బ్రతికించుకుంటాను'' అన్న దామె.

ఈ మాటలు కృష్ణవేణి ఎంత అభిమానం చంపుకుని అన్నదో నాకు అర్థం అయింది. క్రిందా మీదా కాని మధ్యరకపు అంతస్తు అడుక్కో నివ్వదు. కాయకష్టమూ చేసుకోనివ్వదు.

కొత్త ఇంటి మీది మోజుతో, స్పాట్‌లెస్‌గా, పెర్‌ఫెక్ట్‌గా ఇంటిని తీర్చి దిద్దడంతో, ఒంట్లో బొత్తిగా ఓపిక తగ్గిపోయింది నాకు. పనిమనిషి చేసి పోయే పనులు కాక, బండెడు పనులతో మరీ విసిగిపోతున్నాను. ఇంటిపనుల్లో సాయం చేస్తానని కృష్ణవేణి అనగానే నాకు ప్రాణం లేచి వచ్చినట్లయింది.

అప్పటినుంచీ ఏదో ఒక వంక పెట్టుకుని నే నామెను పిలవడం, ఆవిడ వచ్చి నాకు సాయం చేయడం, నే నేదో తోచింది ఇవ్వటం అలవాటు అయిపోయింది.

పప్పు రుబ్బాలన్నా, పూరీలు చేసి పెట్టాలన్నా, బట్టలు ఇస్త్రీ చేసి పెట్టాలన్నా, పిల్లలకు తలంటి పోయాలన్నా

కృష్ణవేణిని కేక వేయందే నేను చేసుకోలేని స్థితికి వచ్చాను.

ఈ ఏర్పాటూ బాగానే ఉందనిపించింది. ఆవిడ అభిమానం చంపుకుని అడుక్కునే పని లేకుండా పోతున్నది. నాకూ ఊరికే దానం ధర్మంగా ఇస్తున్నానే కించ లేకుండా పోయింది.

ఏడాదో, రెండేళ్లో గడిచాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి పాతికేళ్లు దాటినా, స్థితిగతులు మాత్రం మారలేదు. ఇంకా అధ్వాన్నంగా తగలడుతున్నాయి. అవినీతి, స్వార్థం, లంచగొండితనం ఎక్కడ పడితే అక్కడ స్వైరవిహారం చేస్తున్నాయి. నిత్య జీవితావసర వస్తువులుకూడా చీకటి మరుగున పడిపోతున్నాయి. ధరలు చూడబోతే చుక్కల్లోకి చూస్తున్నాయి.

కూలీ నాలీ జనానికి కాని కాలం వచ్చింది. మధ్య తరగతి వాళ్లకు బ్రతుకు మహాభారం అనిపిస్తున్నది.

కృష్ణవేణి మొగుడు మాత్రం యథాప్రకారం పేకాట పిచ్చిలో మునిగి తేలుతున్నాడు. ఇష్టమైతే, చేతిలో ఆ సమయానికి ఉంటే పది రూపాయలు ఇస్తాడు. లేకపోతే లేదు. కృష్ణవేణికి నేను ఇచ్చే ఋణమో పణమో ఆమె ఇబ్బంది తీర్చలేకపోయినా, ఏదో మరీ ప్రాణం మీదకు వచ్చినప్పుడు అడ్డు పడుతూనే ఉంది.

కాస్తో కూస్తో ఆరిక స్తోమతు ఉన్నవాళ్లకు మాత్రం కాలం మరీ అంత గడ్డుగా లేదు. ధరలు ఇదివరకటికన్నా రెట్టింపయినా, చీకటి బజార్లో కొనవలసి వచ్చినా కొంటూనే ఉన్నారు. జీవితం అనుభవిస్తూనే ఉన్నారు.

మాకు కొత్త కారు వచ్చింది. ఆయన గారికి కొత్త కారులో ముందు తిరుపతికి వెళ్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని రావాలని సంకల్పం కలిగింది. పిల్లలకు కూడా సెలవురోజులు కావడంతోనే అనుకున్నదే తడవుగా ప్రయాణం అయినాము.

"కాస్త ఈ వారం రోజులూ ఇల్లూ వాకిలీ కని పెట్టి చూస్తూ ఉండు, కృష్ణవేణీ! గొడ్లూ గోదా కాంపౌండ్‌లోకి వచ్చాయంటే మొక్కలన్నీపాడుచేస్తాయి" అన్నాను, వెళ్లబోయే ముందు.

"అలాగేనండీ! నేను పక్కన ఉండి మొక్కల్ని పాడు చేయనిస్తానా?" అన్నది కృష్ణవేణి.

తీరా ప్రయాణమై సూట్‌కేసులూ అవీ కారులో పెడుతూ ఉండగా కృష్ణవేణి ఏదో సందేహిస్తూ నా దగ్గరకు వచ్చింది.

"పెద్దాడికి మూడు రోజుల్నించీ మంచి జ్వరం. ఆయన రాత్రికూడా ఇంటికి రాలేదు. ఆస్పత్రికి తీసుకెళితే ఏదో మందు రాసి ఇచ్చారు. ఒక్క పది రూపాయలు. . ." అన్నది.

నా కేమిటో చిరాకనిపించింది. అసలే ప్రయాణపు హడావిడి. అడగటానికికూడా సమయం, సందర్భం ఉండక్కర్లే? ఆవిడ ఇబ్బందులూ, చిక్కులూ ఎప్పుడూ ఉండేవే తీరా కారులో కాలు పెట్టబోయే ముందు కూడా నన్నిట్లా వేధిస్తే ఎలా?

"ఇప్పు డెలాగూ వీలయ్యే సమయంగా లేదు, కృష్ణవేణీ! ప్రయాణం పెట్టుకున్నామా మరి? బోలెడు ఖర్చు! ఎలాగో తిప్పలు పడు ఈ సారికి! ఊరి నుంచి వచ్చాక చూస్తానులే!" అన్నాను.

కృష్ణవేణి అలాగే నిలుచుండి పోయింది. కారు బర్రున కదిలి పోయింది.

అప్పు డలా అన్నానే కాని దారి పొడుగునా, నన్నేమిటో నా మనసు వేధిస్తూనే ఉంది. కృష్ణవేణి దీనవదనం నా కళ్లముందు మెదులుతూనే ఉంది.

ప్రయాణంలో ఏమీ ఉత్సాహం చూపించలేకపోయినాను. ఆ కారణంగానో మరేదో నాకే తెలియలేదు. పిల్లలూ ఆయనా మటుకు దారి పొడుగునా అల్లరి చేస్తూనే ఉన్నారు.

స్వామిదర్శనంకూడా ఐశ్వర్యవంతులకు అందుబాటులో వనే! టిక్కెట్లు కొనుక్కుని సలక్షణంగా స్వామిదర్శనం చేసుకున్నాము.

స్వామి సౌందర్యమూర్తి. స్వామి సృష్టించిన ఈ ప్రకృతి పరమ సుందరమైనది. తలనీలాలు ఇచ్చి తమనుతాము వికారం చేసుకోవటం స్వామికి ఇష్టంగా ఉంటుందా? ఉహుఁ ఉండదు! ఆయనకూ నాకు మల్లేనే వ్యథ కలుగుతుంది. ఇదంతా మనం కల్పించుకున్న భ్రమ, అనవాయితీ అనిపిస్తుంది నా కెప్పుడూ.

ఇప్పుడూ అలాగే అనిపించింది. అయితే, నా ఊహకు వ్యతిరేకంగా ఆయన గారు తన మాటే నెగ్గించుకున్నారు.

"ఇంత దూరమూ వచ్చి అలాగే వెళ్లిపోతామా? నేను ముందే మనస్సులో అనుకున్నాను స్వామికి వెంట్రుక లిస్తానని!" అని పట్టు పట్టారు.

తాను ఇవ్వటమేకాక, పిల్ల లిద్దరి వెంట్రుకలూకూడా స్వామికి సమర్పించారు.

"మీకు పుష్కలంగా జుట్టు ఉంది కనక ఇచ్చారు. నాకు తలమీద ఉన్నవే నాలుగు పరకలు! మూడు కత్తెర్లుకూడా ఇవ్వలేను!" అని మొరాయించాను నేను, స్వామికి కోపం రాదని గాఢనమ్మకంతో.

తిరుపతియాత్ర సలక్షణంగా ముగించుకుని రెండు మూడు రోజుల రెస్ట్ హౌస్‌లో రెస్ట్ తీసుకుని తిరుగు ప్రయాణం అయాము మేము.

అయన్నీ, పిల్లల్నీ చూస్తుంటే నా కేదో వికారం కలగటం మొదలె పెట్టింది. ఇదెక్కడి మనస్సు! రేపట్నుంచి మొలుచుకు రావా వెంట్రుకలు? స్వామికి సమర్పించిన సౌందర్యాన్ని గురించి ఇంతలా బాధపడకూడదు!

ఇలా ఎంత సమాధానపరుచుకుందామని చూచినా, నా మనస్సు తన నిర్వేదం మానలేదు.

ఇంటికి దగ్గర పడుతుంటే మళ్లా కృష్ణవేణిని గురించి జంఝాటన పట్టుకుంది నాకు. పిల్లాడి కెలా ఉందో? నన్ను తప్ప ఇంకెవరి దగ్గరా నోరు విడిచి అడిగేది కాదు కృష్ణవేణి. ఒక్క పది రూపాయలు ఇచ్చి వస్తే ఆమె కా ఇబ్బంది తీరిపోయేది. తిరిగి వచ్చినాక నాకే సాయమో చేసి పెట్టేది.

తిరిగి రాగానే, నిజంగానే ఆవిడ సాయం కావలసి వచ్చింది నాకు. వారం రోజులుగా చీపురు వెయ్యని ఇల్లూ, గుడ్డపెట్టి తుడవని సామాను నాకు మాలోకంగా కనిపించాయి.

కృష్ణవేణిని పిలిచి రావటానికి వెళ్లి వచ్చిన పిల్లలు—

"మమ్మీ! మరే, మన కంటే ఆవిడే ముందు వెళ్లి వచ్చింది తిరుపతి!" అన్నారు.

"తిరుపతి వెళ్లి రావటమేమిట్రా మీ మొహం! వెళ్లి ఆడుకోండి కాస్సేపు! నాకు చచ్చేంత పని ఉంది!" అని పనిలో మునిగిపోయాను.

నేను వంటింట్లో సామానంతా కడిగి వంట ప్రయత్నంలో ఉండగా వచ్చింది కృష్ణవేణి.

"ఎప్పు డొచ్చారండీ? కులాసాగా స్వామి దర్శనం చేసుకు వచ్చారా?" అని ఆమె పలకరిస్తుందని అనుకున్నాను.

మాట్లాడకుండా ఆమె నించునేసరికి నేనే "రా, కృష్ణవేణీ! మీ అబ్బాయికి జ్వరం తగ్గిపోయిందా?" అన్నాను వంగి ఏదో పని చేసుకుంటూనే.

కృష్ణవేణి మాట్లాడకుండా కళ్లు తుడుచుకునేసరికి నా కేమిటో గాభరా అనిపించింది. పిల్లాడికేమయినాఅయిందా? అయ్యో రామ! ఎంత పని జరిగింది!

"ఏమిటి? ఏమయింది, కృష్ణవేణీ! పిల్లాడికి తగ్గలేదా?" గాభరాగా అడిగాను.


"నన్నింక 'కృష్ణవేణీ!' అని పిలవకండి" అన్నదామె తల వంచుకుని కాస్త గద్గద స్వరంతో.

గప్పున ఆమె వంక పరీక్షగా చూచాను. తలకు చెవుల మీదుగా ఏదో గుడ్డ కట్టి ఉంది. తల మీదకు పైటచెంగు కప్పుకుని ఉంది.

"అదేమిటి! అయ్యయ్యో! నీ జుత్తంతా ఏమైంది? ఏం జరిగింది? చెప్పవూ,



ఫొటో—పాడూరి రవి (హైదరాబాదు-16)




లం

(2 వ పేజీ తరువాయి)

భావిస్తాము అనికోవటం. అందుకే ఈ అనుభూతి చిరస్థాయిగా ముందు ముందు మా హృదయాలలో నిలిచిపోయేటట్లు ప్రభ మా ముం దుంటుందని. . . సెలవు.

—వి. వెంకటేశ్వర్లు (గార్ల)

* * *

'ప్రసన్నరాణి' ముఖచిత్రం బాగుంది. 'గడ్డిపూలు', 'వక్రరేఖలు', 'పాలూ-నీళ్లూ', 'ఢిల్లీ కా లడ్డూ'-దేనికది వెరైటీగా ఉండి హృదయానికి హత్తుకుపోయేవిగా ఉన్నాయి. 'గడ్డిపూలు' కథ కులాంతర, మతాంతర వివాహాలు విఫలం అవుతాయి అనుకునేవారికి సహేతు కంగా, సవివరంగా సమాధానం చెప్పారు రచయిత. ముగింపు జాలిగా ఉంది. 'వక్రరేఖలు'లో జానకి లాంటి ఇల్లాళ్లు మన సమాజంలో చాలా మంది ఉన్నారు. వ్యసనాలకు బానిసలై సంసారాన్ని గుల్ల చేసుకుంటూ భార్యా బిడ్డలను గాలికి వదిలి జల్సాగా తిరిగేవారిని తలుచుకుంటే పీక పిసికి చంపాలన్నంత కోపం వస్తుంది. అలాంటివారికి అనుమానంకూడా తోడైతే వ్ ... పిటీ. 'పాలూ—నీళ్లూ' కథకూడా చాలా బాగుంది. తాను సాధారణ కుటుంబంలో పుట్టి మామూలుగా పెరిగినా, ఆడంబరంగా, అధునాతనంగా బ్రతకాలని భర్తలను వేధించే శారదలూ చాలా మంది ఉన్నారా అనిపించింది. 'ఢిల్లీ కా లడ్డూ' నిజంగా వాస్తవ చిత్రణ. కథ చివరిలో "ఒక మగాడు, ఒక ఆడదీ. . ." అంటూ మొదలైన పేరాలోని మాటలు పాఠకుల హృదయాల్ని ఆలోచనా తరంగాలలో ముంచెత్తుతాయి. కథలో పద్మనాభంతో పాటు మాకూ సమాధానం దొరకలేదుస్మండి! 'సాహిత్య సమాజ్ కా దర్పణ్' అన్న మాటను నిజం చేస్తూంది మన ఆంధ్రప్రభ.

—బంధకవి సూర్యకుమారి (కేతావారిగూడ)

* * *

నళిని జయంతిగారి 'గడ్డిపూలు' ఈ వారం ప్రభకు హైలైట్. వంశీ—కవితల ప్రేమానుబంధం ఈ నాటి యువతరానికి చక్కని గుణపాఠం.

'పాలూ—నీళ్లూ'లో నాచురాలిటీ కన్న ఆర్టిఫిషి యాలిటీ అధిక పాళ్లలో ఉంది.

విద్వాన్ విశ్వంగారి 'మాణిక్యవీణ' ప్రసాదించే విజ్ఞానం అమోఘం.

—రాధామాధవ్ (పెనగలూరు)

* * *

కథల్లో 'పాలూ—నీళ్లూ', 'వక్రరేఖలు' బాగా నచ్చాయి, 'గడ్డిపూలు' ద్వారా రచయిత్రి పాఠకులకు అందించాలనుకున్న దేమిటో అర్థం కాలేదు.

'లలితాదేవి'లో శాంతి పట్ల శ్రీనివాస్ ప్రవర్తన చదువుతుంటే ఒక వైపు కోపం, మరోవైపు ఆ పాత్రకు జరిగిన అన్యాయం జ్ఞప్తికొచ్చి జాలి కలుగు తూంది.

ఇక 'జీవన సమరం'లో ఇందిర మేం మరిచిపోలేని పాత్రగా మిగిలిపోతుందేమో!

—ఆర్. విమల, విజయ (కానాయపల్లి)

* * *

విశ్వంగా రన్నట్లు ఒకప్పుడు 'జనవరి 26' అనగానే ఒడలు పులకరించేది. కాని, ఎందువల్లనోగాని ఆ రోజును కూడా సామాన్యంగా భావిస్తున్నారు నేడు. ఇక 'మాణిక్య వీణ' చదివితే మన దేశం పురోగమిస్తున్నదో, లేదో అన్న అనుమానం వచ్చింది. గద్దెమీద కూర్చున్నవారు ఎన్నికల గురించి ఆలోచించే వారేగాని, ప్రజల కష్టసుఖాలలో పాలు పంచుకునే వారు ఎవరూ లేరండీ, ఈ కాలంలో.

—టి. వి. వి. రామారావు (బొబ్బిలి)

* * *

30—1—74 వ తేదీ సంచిక అట్టమీద చోటు చేసుకున్న 'ప్రసన్నరాణి' వదనం ప్రసన్నంగా ఉంది.

'లలితాదేవి' లో సస్పెన్సును రచయిత్రి ముందే బయట పెట్టినందువల్ల కథలో పెద్ద థ్రిల్ లేదు. కాని, అన్నదమ్ముల అనురాగం, బావామరదల్ల చిలిపి తనం బాగుంది. లలిత కోసం తపించిపోయి ఆమె దరి జేరిన శ్రీనివాస్‌కు చదువు లేదనే చులకనభావంతో లిప్పి కొట్టింది. ఎంతో నిరాశ చెందిన శ్రీనివాస్ చివర్లో అదే సైకాలజీని శాంతి పట్ల ప్రదర్శించడం ఆశ్చర్యంగా ఉంది. కాని, తాను కాదన్న మరుక్షణం శాంతి తన తనువు చాలించడానికైనా సిద్ధపడిందని తెలుసుకుని ఆమె నాదరించి ఎంతో మానసిక పశ్చాత్తాపానికి గురి అయ్యాడు. తన లోని మానవత్వాన్ని మేల్కొలిపాడు. లేకుంటే ఒక రాక్షసుడిలా పతితుల స్మృతిపథంలో మిగిలిపోయే వాడేమో! ఏమైనా 'లలితాదేవి' సీరియల్ లాఖోఁమే ఏక్'.

—నిమ్మల వెంకటరత్నం (నరసాపురం)

* * *

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ఒక వారం కన్న ఇంకో వారం మిన్నగా తయారయి వెలువడుతూంది. 'జయంతి' ముఖచిత్రంతో వెలువడిన ప్రభలో 'మూగమనుషులు— ప్రేమమనసులు' కథ నన్నెంత గానో ఆకట్టుకొంది. సుశీలామూర్తిగారు మంచి శిల్పాన్ని ఎన్నుకున్నారు.

ఎక్కడో మదరాసులో జరుగుతున్న నాటకాల్ని, భరతనాట్యం కార్యక్రమాల్ని ఇంత దూరంలో ఉన్న మాకు క్లుప్తంగా, కళ్లకు కట్టినట్టుగా రాస్తున్న 'ఎల్లోరా'గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలపండి.

—చిలుకూరి దేవపుత్ర (అనంతపురం—2)

* * *

'ప్రసన్నరాణి' ప్రసన్న వదనంతో వెలువడిన 30—1—74 వ తేదీ సంచిక చాలా విలువైనదిగా కనిపించింది. 'వక్రరేఖలు', 'పాలూ—నీళ్లూ', 'ఢిల్లీ కా లడ్డూ' కథలు నేటి సమాజానికి ప్రతిబింబాలా అనిపించేట్లుగా ఉన్నవి.

—మల్లికార్జున్ సన్నే (వరంగల్) ★

---

కృష్ణవేణీ?" అన్నాను ఎంతో సంకోచంతో!

"నా కున్న సంపదంతా అదే కదండీ! అవసరానికి అడ్డు రాకపోతే ఎలా? దాన్ని సవరాల షాపులో వదుల్చుకుని పిల్లాణ్ణి బ్రతికించుకో గలిగాను. వాడికి కాస్త నయమే ఇప్పుడు" అన్నది ఆమె కింద చూస్తూనే.

నాకు ముచ్చెమటలూ పోశాయి. కాళ్లలో వణుకుపుట్టుకు వచ్చింది.

"ఎంత పని చేశావు, కృష్ణవేణీ! నీ ముఖం ఎలా చూడను!" అన్నాను కడుపంతా చెరువైపోయి.

"అదేనండీ నా బాధ! నా ముఖం మీ రెలా చూస్తారు! నన్ను మీరు 'కృష్ణవేణీ!' అలి పిలుస్తూంటే అందరూ పిలిచినట్లు అనిపించేది కాదు. శ్రద్ధగా నూనె రాసి, జుత్తు దువ్వి జడ వేసుకోక పోయినా, మీ పిలుపు వింటూంటేనే 'నా కేశభారం', 'నా కృష్ణవేణి' గుర్తుకు వచ్చేది. ఏ గర్వానికీ నోచుకోకపోయినా, మీ పిలుపు వింటూనే, నా కేదో కాస్తంత గర్వం కలిగేది. ఇప్పు డెలా చూస్తారు నా మొహం! ఉహూఁ! చూడలేరు! 'కృష్ణవేణీ' అనికూడా పిలవలేరు!" అన్న దామె ముఖం రెండు చేతులతో కప్పుకుంటూ.

నిజమే! కృష్ణవేణి ముఖం ఎలా చూడను? ఆమెకు అర్థం అయేట్లు ఎలా చెప్పను?

ఆవిడ ముఖం చూడలేకపోవటానికి ఇప్పుడు నా సౌందర్యప్రియత్వం కాదు అడ్డు వచ్చేదని ఆమెకు ఎలా చెప్పను?

కొన్నాళ్లు పోతే ఆమెకు మళ్లీ కేశ భారం రావచ్చు. అప్పుడు ఆమె మళ్లీ వెనకటి కృష్ణవేణి కావచ్చు.

కాని, నా నిర్వేదం నన్ను ఎప్పటికీ విడిచిపెట్టేలా లేదు. నా అంతరాత్మ నన్ను ఎప్పటికీ వేధించుకు తినేలాగ ఉంది!

★